క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం



ఆలయ చైర్మన్ సుధాకరరావుకు విరాళం చెక్కును అందజేస్తున్న దాత శ్రీనివాస చౌదరి

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఒక భక్తుడు సోమవారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. ఇబ్రహీంపట్నంకు చెందిన మలీల శ్రీనివాస చౌదరి ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ చైర్మన్ ఎస్వీ సుధాకరరావుకు అందించారు. ఈ సందర్భంగా దాతకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి సత్కరించారు. అలాగే చిన వెంకన్న నిత్యాన్నదాన ట్రస్టుకు ఉంగ్రాజవరంకు చెందిన మల్లిన శేషగిరిరావు సోమవారం రూ. 1,01,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ ఆర్.లక్ష్మణ స్వామి విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

పుస్తకాల వితరణ



డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలు అందజేస్తున్న దాత వేణుగోపాల్

కామవరపుకోట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి టి.నరసాపురం మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన భూక్యా గోపయ్య సక్రమ ఫౌండేషన్ చైర్మన్ భూక్యా వేణుగోపాల్ రూ.5 వేల విలువ కలిగిన పుస్తకాలు బహూకరించారు. కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్, నాయకత్వ లక్షణాలు, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి పుస్తకాలను కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.మల్లేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా భూక్యా వేణుగోపాల్‌కి, ఆయన కుమార్తె హిమజాస్వినికి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్‌గా జెడ్పీటీసీ రమేష్



జెడ్పీటీసీ రమేష్

కామవరపుకోట: జిల్లా విజిలెన్స్ కమిటీ డైరెక్టర్‌గా కామవరపుకోట జెడ్పీటీసీ కడిమి రమేష్ ఎన్నికయ్యారు. ఆయన ఎన్నిక పట్ల మండలంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పలువురు హర్షం వ్యక్తం చేశారు. అవకాశం కల్పించిన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీకు జెడ్పీటీసీ రమేష్ కృతజ్ఞతలు తెలియజేశారు.

31న సంతోషిమాతకు పూజలు

ఏలూరు రూరల్ : రాఖీపౌర్ణమి సందర్భంగా ఈ నెల 31న కొల్లేరు గ్రామం మొండికోడులో వెలసిన శ్రీసంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, అభరణాలతో అలంకరించి అమ్మవారి పుట్టినరోజు వేడుక కనులపండువగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. సంతోషి మాత దర్శనం కోసం ఏటా కొల్లేరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చే యువతీ, యువకులు, భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు పర్యవేక్షణలో ఆలయ ఆవరణలో భక్తులకు భారీ అన్నసమారాధన చేపట్టనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఈవీఎంల పరిశీలన

ఏలూరు(మెట్రో): సాధారణ తనిఖీల్లో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఈవీఎంల గోదాంను పరిశీలించారు. కలెక్టరేట్ వద్ద ఉన్న గోదాం తాళాలకు వేసిన సీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రత ఏర్పాట్లను ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను తనిఖీ చేసి సమగ్ర నివేదిక పంపిస్తున్నట్టు చెప్పారు. పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎస్ఎస్ మూర్తి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర తదితరులు ఉన్నారు.

రాట్నాలమ్మ ఆలయంలో హుండీ లెక్కింపు

పెదవేగి : మహిమ గల తల్లి రాట్నాలమ్మ హుండీని భక్తుల సమక్షంలో దేవస్థాన సిబ్బంది లెక్కింపు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి దేవస్థానంలోని హుండీలను సోమవారం లెక్కించగా రూ.20,16,980 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ చల్లగొళ్ళ వెంకటేశ్వరరావు చెప్పారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు ధర్మకర్తలు గరికిముక్కు సర్వేశ్వరరావు, పాకలపాటి వెంకటేశ్వరరావు, మేరుగు వెంకటేశ్వరరావు, నంబూరి జనార్దన్‌రావు, నాగార్జున లక్ష్మీరాధిక, ఈడా ధర్మారావు, కట్టా నాగరాజు, లింగాల కనకారావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే లక్ష్యం

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- పాత పట్టిసీమలో గడపగడపకు మన ప్రభుత్వం



లబ్ధిదారులకు బ్రోచర్‌లను అందిస్తున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

పోలవరం రూరల్: పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ఆయన అమలు చేస్తున్నారన్నారు. పోలవరం మండలం పాతపట్టిసీమ గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును తెలుసుకున్నారు. పథకాలు పొందిన లబ్ధిదారులకు బుక్‌లెట్‌లను అందించారు. ఇంకా పథకాలు అందనివారు ఎవరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పర్యటనలో ప్రజలు తెలిపిన పలు సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రతి గడపకు వెళ్లి సమస్యలు తెలుసుకుని చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్నామన్నారు. టీడీపీ పాలనలో సంక్షేమ పథకాల కోసం అనేక అవస్థలు పడేవారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న సంక్షేమ పరిపాలనను ప్రజలు గుర్తిస్తున్నారని రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. పాత పట్టిసీమ గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సచివాలయ సిబ్బంది ఈ కార్యాలయం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ, సర్పంచ్ ఎస్.శ్రీరామమూర్తి, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీవో జి.శ్రీను, సొసైటీ అధ్యక్షుడు పాదం రాజబాబు, సుంకర అంజిబాబు, బండారు అప్పారావు, ఏఎంసీ డైరెక్టర్లు దాకే మంగాయమ్మ, షేక్ ఫాతిమ స్వీసా, ఎంపీటీసీలు దెగపాటి హరిరామకృష్ణ, మిడియం సింగరాజు, యామల శ్రీదేవి, కాశీ ధనలక్ష్మి, సచివాలయ కన్వీనర్ పాదం సాయిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల బుజ్జి, తెలగంశెట్టి దొరబాబు, మాదేపల్లి హరిబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామకంతం భూమిలో నివసిస్తున్న వారికి శాశ్వత హక్కు



లబ్ధిదారులకు భూ హక్కుపత్రాలను అందజేస్తున్న మాజీ ఏఎంసీ చైర్మన్ సాయిబాబు, సర్పంచ్ ప్రసాద్

లింగపాలెం: గ్రామకంతం భూముల్లో నివసిస్తున్న వారికి ప్రభుత్వం శాశ్వత భూహక్కు పట్టాలను అందజేస్తున్నన్నట్లు చింతలపూడి మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు తెలిపారు. జిల్లాలో లింగపాలెం మండలం మఠంగూడెం పంచాయతీ శివారు చంద్రన్నపాలెం గ్రామాన్ని వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసి సర్వే నిర్వహించటం జరిగింది. ఈమేరకు సోమవారం చంద్రన్నపాలెం గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు చేతులు మీదగా లబ్ధిదారులకు ఆస్తి యాజమాన్య భూహక్కు పట్టాలను అందజేశారు. ఈసభలో సాయిబాబు మాట్లాడుతూ గతంలో గ్రామకంతంలో నివసించే వారికి తమ భూమిని చట్టబద్ధంగా అమ్ముకోవడానికి, బ్యాంక్ ద్వారా రుణసదుపాయం పొందటానికి వీలు లేదని, ఇప్పుడు ఈఅవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. ప్రభుత్వం ఇస్తున్న పట్టాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాదిల ప్రసాద్, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేత మునునూరి వెంకటేశ్వరరావు, మండల రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎంఎల్‌వీఎస్ భాస్కరరావు, ఎంపీడీవో కార్యాలయ పరిపాలనాధికారిణి జి మణికుమారి, మండల పంచాయతీ విస్తరణాధికారి జె రత్నకుమార్, కార్యదర్శి ప్రవీణ్, వీఆర్వో, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ యార్డు అభివృద్ధికి కృషి చేయాలి



ఏఎంసీ యార్డు సిబ్బందికి నూతన వస్త్రాలు బహూకరిస్తున్న చైర్‌పర్సన్ శాంతకుమారి

కొయ్యలగూడెం: పోలవరం నియోజకవర్గానికి ప్రధాన కేంద్రంగా ఉన్న కొయ్యలగూడెంలో ఏఎంసీ యార్డ్ ఉండటం మార్కెట్ కమిటీకి లాభదాయకమని దీనిని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా మనమందరం కృషి చేయాలని ఏఎంసీ చైర్‌పర్సన్ ఆరేటి శాంతకుమారి అన్నారు. సోమవారం ఏఎంసీ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి యార్డు అభివృద్ధికి సూచనలతో పాటు రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. రెండు దశాబ్దాలుగా ఏఎంసీ యార్డు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోలేదని ఇప్పటికైనా సమష్టి కృషితో యార్డ్ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శాంతకుమారి అన్నారు. ముఖ్యంగా పశువుల సంత నిర్వహణకు యార్డును ఉపయోగిస్తే కొయ్యలగూడెం మండలంతో సహా పది మండలాల ప్రజలకు, రైతులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. వినాయక చవితి పురస్కరించుకొని సిబ్బందికి నూతన వస్త్రాలను ఆరేటి శాంతకుమారి, సత్యనారాయణ దంపతులు అందజేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ తాడిగడప రామకృష్ణ, డైరెక్టర్లు తోట జయబాబు, కొల్లూరు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు సౌకర్యాల కల్పనే ధ్యేయం

శ్రీవారి దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు



నూతన సీఆర్వో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు

ద్వారకాతిరుమల: భక్తులకు సౌకర్యాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు శ్రీవారి దేవస్థానం చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. కొండపైన సర్వీసింగ్ స్టేషన్ పక్కన నూతనంగా నిర్మించిన సెంట్రల్ రిసెప్షన్ (సీఆర్వో) కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావుతో కలసి ప్రారంభించారు. ముందుగా సీఆర్వో కార్యాలయం వద్ద శ్రీవారి చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం చైర్మన్ సుధాకరరావు రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆలయ తూర్పు ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా ఇప్పటి వరకు అక్కడున్న ఈ సీఆర్వో కార్యాలయాన్ని ఇక్కడకు మార్పు చేసినట్టు ఈఓ తెలిపారు. భక్తులు గమనించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు నాళం కృష్ణ వీర సుబ్బలక్ష్మి, చిట్టూరి మణి, ముస్సే శ్రీను, పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, మానుకొండ సుబ్బారావు, తాణంకి గంగరాజు, పాయం మంగతాయారు, పాలా వెంకటేశ్వరరావు, బోడపాటి దేవి మౌనిక, వాసా రామకృష్ణారావు తదితరులున్నారు.

తొలగించిన పేర్లకు గ్రామసభ



గ్రామసభలో మాట్లాడుతున్న స్థానిక నాయకులు

కుక్కునూరు: ఆర్అండ్ఆర్ ప్యాకేజీకి సంబంధించి తమకు పరిహారం మంజూరు చేయాలని గతంలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను తిరస్కరించిన విషయమై తీర్మానం కోరుతూ సోమవారం కుక్కునూరులో గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో స్థానిక నాయకులు మాట్లాడుతూ గ్రామసభ తీర్మానానికి సంబంధించి గతంలో జీలుగుమిల్లి తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తుదారుల ఆధారాలను పరిశీలించి, అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ వారి పేర్లను అనర్హులుగా పేర్కొంటూ తిరస్కరించారని, దరఖాస్తు చేసుకున్న పేర్లలో కేవలం నాలుగు పేర్లను మాత్రమే అర్హులుగా గుర్తించడం ఏమిటని నాయకులు అధికారులను ప్రశ్నించారు. మరికొన్ని పేర్లు ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ లాగిన్‌లో ఉన్నాయని, ఆ పేర్లు కూడా వచ్చిన తరువాతనే గ్రామ సభ ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ సిబ్బంది సమక్షంలో నిర్వహించి, అందులో స్థానికులు ఎవరో, స్థానికేతరులు ఎవరో తీర్మానం చేస్తామని సర్పంచ్ రావు మీనా తీర్మానం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర, వైఎస్సార్ సీపీ నాయకులు కుచ్చర్లపాటి నరసింహరాజు, రావు వినోద్, మాదిరాజు వెంకన్నబాబు, ఇతరులు పాల్గొన్నారు.

ఆంధ్ర ఫిష్ భవన నిర్మాణానికి శ్రమదానం



ఆంధ్ర ఫిష్ భవనానికి శ్రమదానం చేస్తున్న పంచాయతీ వార్డు సభ్యులు

కొయ్యలగూడెం: సంత మార్కెట్ యార్డులో నిర్మిస్తున్న ఆంధ్ర ఫిష్ భవన నిర్మాణానికి పంచాయతీ వార్డు సభ్యులు శ్రమదానం చేశారు. సర్పంచ్ ముప్పిడి విజయకుమారి నేతృత్వంలో భవన నిర్మాణ పనులు కొనసాగుతుండగా కార్మికుల కొరతతో రెండు రోజుల నుంచి పనులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో సర్పంచ్ భర్త చినబాబుతో సహా వార్డు సభ్యులు ఏలేటి భాస్కర్, గొలిశెట్టి ప్రసాద్, మరో ఇద్దరు వార్డు సభ్యులు శ్రమదానం చేసి పనులు ఆగకుండా తోడ్పాటు అందించారు. పంచాయతీ నిధులు రూ.4 లక్షలు మత్స్యకార సొసైటీ నిధులు రూ.3.60 లక్షలు కలిపి ఆంధ్ర ఫిష్ భవనాన్ని నిర్మిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. వినాయక చవితి ఉత్సవాలనాటికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతులమీదుగా ఈ భవనాన్ని ప్రారంభించడానికి కృషి చేస్తున్నామని చెప్పారు.

కొత్త రేషన్‌కార్డుల మంజూరు

ఏలూరు రూరల్: ప్రభుత్వం కొత్తగా 926 పేద కుటుంబాలకు కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేసిందని ఏలూరు మండల సివిల్ సప్లయి డిప్యూటి తహసీల్దార్ రమేష్ తెలిపారు. ఇందులో 784 కార్డులు ఏలూరు నగరవాసులకు, మరో 178 కార్డులు గ్రామీణ ప్రజలకు మంజూరైనట్టు చెప్పారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి కొత్తకార్డుదారుల ఇంటివద్దనే బియ్యం, పంచదార పంపిణీ చేస్తామని తెలిపారు.

వాలీబాల్ అంతర్ కళాశాలల పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ స్కైలాబ్

చింతలపూడి: జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడి వారి ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ప్రాంగణంలో వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డా.స్కైలాబ్ పోటీలను ప్రారంభించారు. పట్టణంలోని వివిధ విద్యాసంస్థల మధ్య వాలీబాల్ పోటీలు లీగ్ పద్ధతిన నిర్వహించనున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ చైర్మన్ డా.పి.శ్రీనివాసరావు తెలిపారు. పోటీల్లో లిటిల్ ఫ్లవర్ డిగ్రీ కాలేజ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల , ప్రభుత్వ ఐటీఐ, అర్చణ జూనియర్ కాలేజ్, గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నుంచి రెండు టీములు మొత్తంగా ఆరు టీములు పాల్గొన్నట్లు తెలిపారు. ఇటువంటి సిటీ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్లు ప్రతినెలా తమ కళాశాలలో వేర్వేరు క్రీడల్లో నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నరేంద్ర కుమార్, గేమ్స్ అండ్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.మొహమ్మద్ అంజద్ ఆలీ పాల్గొన్నారు.

సామెతలు, పొడుపు కథలపై పోటీ



తెలుగు భాష వారోత్సవాల్లో ముఖ్య అతిథులను సన్మానిస్తున్న దృశ్యం

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల చింతలపూడిలో తెలుగు భాష వారోత్సవాలలో భాగంగా తెలుగు శాఖ ఆధ్వర్యంలో సోమవారం సామెతలు, పొడుపు కథలు అనే అంశంపై విద్యార్థులకు పోటీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సుబ్బరాజు హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయురాలు బోడా పార్వతి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడుతూ సామెతలు సూత్రప్రాయంగా చిన్న వాక్యాలుగా ఉంటాయన్నారు. ఇవి ఒక జాతి నాగరికతను చెప్పకనే చెబుతుంటాయని, ఇవి పూర్వుల అనుభవ సారాన్ని తెలియజేసే అమృత గుళికలని పేర్కొన్నారు. 'ఆకలి రుచి ఎరుగదు, నిద్ర సుఖమెరుగదు' అంటూ సామెత అర్థాన్ని తెలిపారు. ప్రిన్సిపాల్ డా.పి.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌జేకే నరేంద్ర కుమార్, తెలుగు శాఖధిపతి డా. జి శ్రీనివాస్, తెలుగు అధ్యాపకురాలు డా.బి సరస్వతి మాట్లాడుతూ సామెతలు పొడుపు కథలు, కథలు, కవిత తెలుగు భాషకు ఒక మాధుర్యాన్ని, అందాన్ని ఇస్తాయన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన బోడా పార్వతిని ఘనంగా సన్మానించారు.

ఆర్డీవోకు ఉద్యోగుల ఫిర్యాదు



జంగారెడ్డిగూడెం ఆర్డీవోకు ఫిర్యాదు చేస్తున్న ఏడీఏ బుజ్జిబాబు, ఇతర ఉద్యోగులు

జంగారెడ్డిగూడెం: స్థానిక సుబ్బంపేటలో గల జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్‌కు చెందిన భవనాన్ని గతంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు నిర్మించుకున్నారని, అయితే ఆ స్థలంలో ఉన్న భవనానికి కొందరు తమను రానీయకుండా ఆటంకపరుస్తూ భవనానికి తాళాలు వేశారని, వ్యవసాయ శాఖ ఏడీ బుజ్జిబాబు, కొందరు ఉద్యోగులు సోమవారం ఆర్డీవో ఎం.ఝాన్సీరాణికి ఫిర్యాదు చేశారు. 1998లో ఉద్యోగులంతా స్థలాన్ని కొనుగోలు చేసి భవనాన్ని నిర్మించుకున్నారన్నారు. అప్పటి డీఎస్పీలు బ్రహ్మారెడ్డి, మురళి అధ్యక్షులుగా వ్యవహరించారని పేర్కొన్నారు. అయితే తరువాత కాలంలో భవనం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల ప్రభుత్వ ఉద్యోగులంతా కలిసి భవనాన్ని ఆధునీకరించి సమావేశాలు నిర్వహించుకుంటూ షెటిల్ కోర్టు కూడా వేసుకున్నట్లు తెలిపారు. అయితే కొందరు వ్యక్తులు తమను రానీయకుండా అడ్డుకుంటూ తాళాలు వేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. అలాగే ఏలూరు ఆఫీసర్స్ క్లబ్‌లో జిమ్ పరికరాలను జిల్లా కలెక్టర్ ఏర్పాటు చేశారని, జంగారెడ్డిగూడెం అసోసియేషన్‌కు కూడా జిమ్ పరికరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కాగా ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ రకాల ఫిర్యాదులు 14 వచ్చినట్లు ఆర్డీవో తెలిపారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



సహాయ ఫౌండేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న అదనపు జిల్లా అడిషనల్ ఎస్పీ సూర్యచంద్రరావు

కామవరపుకోట: సమాజసేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు అన్నారు. కామవరపుకోటలో నూతనంగా నెలకొల్పిన సహాయ ఫౌండేషన్ లోగోను ఆయన ఆవిష్కరించారు. స్థానిక శ్రీ లక్ష్మీ హయగ్రీవ పీఠం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఫౌండేషన్ సభ్యులకు సూచించారు. ఇప్పటికే పలు సహాయ కార్యక్రమాలు చేపట్టి, ప్రజల్లో గుర్తింపు ఉన్న వ్యక్తుల చేత సహాయ ఫౌండేషన్ ట్రస్ట్ ఏర్పాటు చేయటం అభినందించదగిందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు తమ్మిశెట్టి సత్యనారాయణ, గౌరవ సలహాదారులు సుదర్శనం దుర్గబాబు, సభ్యులు నిజాపరపు దుర్గాప్రసాద్, సుదర్శనం శ్రీనివాస్, కొనకళ్ళ అంజిబాబు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతి నాడు సేవా కార్యక్రమాలు చేపట్టాలి

బుట్టాయగూడెం: సెప్టెంబర్ 2వ తేదీన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 14వ వర్ధంతి సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేపట్టాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ పోలవరం నియోజకవర్గంలోని ప్రతి మండలంలో వైఎస్సార్ విగ్రహాలను శుభ్రపరిచి రంగులతో అలంకరించాలని కోరారు. వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించాలని అన్నారు. కార్యక్రమాల్లో ఆయా మండలాల్లో ఉండే పార్టీ నాయకులు, కార్యకర్తలు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లు, మండల జేసీఎస్ కన్వీనర్‌లు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీ, ఏఎంసీ చైర్మన్, మార్కెట్ కమిటీ సభ్యులు, మండల కన్వీనర్లు పాల్గొనాలని ఆయన కోరారు.

గోడపత్రిక విడుదల

బుట్టాయగూడెం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 28వ తేదీ నుంచి సెప్టెంబర్ 4 వరకూ నిరసన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సీపీఎం నాయకులు తెల్లం రామకృష్ణ తెలిపారు. సోమవారం బుట్టాయగూడెంలోని ఆ పార్టీ కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు సంబంధించి రూపొందించిన గోడ పత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత రోజురోజుకూ ధరలు పెంచుతూ ప్రజలపై మోయలేని భారం మోపారని విమర్శించారు. నిరసన కార్యక్రమంలో ప్రతిఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థులకు క్రీడా పోటీలు



టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: నేషనల్ స్పోర్ట్స్ డే పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇంటర్ కాలేజియేట్ టోర్నమెంట్ సోమవారం నిర్వహించారు. కళాశాల విద్యార్థులకు క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న కళాశాల పూర్వ విద్యార్థి, సీపీడీసీ మెంబర్ బి.సత్యనారాయణ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో జంగారెడ్డిగూడెం గవర్నమెంట్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, సూర్య, వివేకానంద, శబరి, గాయత్రి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బుట్టాయిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కామవరపుకోట మోడల్ కాలేజ్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ ప్రసాద్‌బాబు తెలిపారు. విజేతలకు మంగళవారం రోలింగ్ ట్రోఫీలు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపదమిత్రల ఆపన్న హస్తం



వృద్ధురాలికి భోజన ప్యాకెట్‌ను అందిస్తున్న ఆపదమిత్రలు

కుక్కునూరు: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం మిన్న అన్న పెద్దల మాటను వారికొచ్చే చిరుజీతాలతో నిజం చేస్తున్నారు మండలానికి చెందిన ఆపద మిత్రలు. కుక్కునూరు మండలంలోని అనాథలకు, మతి స్థిమితం లేని వృద్ధులకు తమ సొంత ఖర్చులతో ఆపద మిత్రలు అన్నాన్ని అందిస్తున్నారు. చిరు ఉద్యోగులైన ఆపదమిత్రలు గుగ్గులోతు బాబు, చిచ్చోడి సమ్మయ్య, మహేష్‌బాబు, శివశంకర్, భీమరాజు, విజయలక్ష్మి తమకు వచ్చిన దానిలో కొంత సేవా కార్యక్రమానికి వినియోగిస్తున్నామని తెలిపారు. ఇలా ప్రతీనెలా ఏదో ఒక చోట అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఆపదమిత్రలను మండల ప్రజానీకం అభినందిస్తున్నారు.

రేపు ఐటీడీఏ పాలకవర్గ సమావేశం

బుట్టాయగూడెం: ఈ నెల 30వ తేదీన ఐటీడీఏ పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీఓ ఎం. సూర్యతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి జిల్లా, డివిజన్ స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 35 మంది ఎంపిక

ఏలూరు (టూటౌన్): సర్ సీఆర్‌రెడ్డి కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 35 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వసంత్ కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్, విశాఖపట్టణం ప్రతినిధులు సోమవారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఎంఎస్సీ ఆర్గానిక్, ఎనలైటికల్, బీఎస్సీలో కెమిస్ట్రీ సబ్జెక్టు చదివిన విద్యార్థులకు రాతపరీక్ష, టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను సీఆర్‌రెడ్డి విద్యాసంస్థల కార్యదర్శి ఎంబీఎస్ ప్రసాద్, పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాసరావు, డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కేఎస్ విష్ణుమోహన్, ఇంటర్ కరస్పాండెంట్ కలగర శివ రామకృష్ణ ప్రసాద్, మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ కేఏ రామరాజు, పీజీ డైరెక్టర్ వీఆర్ఎస్ బాబు యలమర్తి, మహిళా కళాశాల ప్రిన్సిపాల్ పి.శైలజ, ఐక్యూసి కోఆర్డినేటర్ జి.రాము అభినందించారు.

30న సత్కారం

దెందులూరు: ఆజాదీ అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈ నెల 30న ప్రధాని నరేంద్రమోదీ సూచన మేరకు మేరా మాటి మేరా దేశ్ నినాదంతో స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తున్నామని దెందులూరు బీఆర్‌డీ నర్సింగ్ కళాశాల కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు తెలిపారు. 161 అడుగుల జాతీయ పతాకంతో 500 బైకులతో భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. దెందులూరు, కొవ్వలి, దోసపాడు, పోతునూరు, సోమవరప్పాడు, సత్యనారాయణపురంలోని స్వాతంత్ర్య సమరయోధులను కలిసి వారికి జాతీయ జెండాలు అందజేసి ఆహ్వానించినట్టు తెలిపారు.